వెంటాడుతున్న తాగునీటి సమస్య

- పరిష్కరించాలని స్వచ్ఛంద సంస్థలు, వామపక్షాల ఆందోళన
- అక్టోబర్ 1న చలో కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణానికి తాగునీటి సమస్య దశాబ్దాల కాలంగా వేధిస్తోంది. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నీటి సమస్యకు పరిష్కారం పాలకులు చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం ప్రజల సమస్యలను దారి మళ్లించేందుకు ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగావళి, జంఝావతి రెండు నదులు పార్వతీపురం పట్టణం చెంతనే ప్రవహిస్తున్నా ప్రజలకు ప్రతీ రోజు తాగునీరు అందివ్వలేని స్థితి నెలకొంది. ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా పెరిగిన జనాభాకు అవసరాలకు సరిపడ తాగునీరు, మౌలిక సదుపాయాలు లేక చాలా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. ఇంటి పన్ను, కుళాయి పన్ను, చెత్త పన్ను తదితర పన్నులు వసూలు చేసే శ్రద్ధ పైప్‌లైన్లు ఇవ్వడంలో ఎందుకు లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో 73 వేల మంది జనాభా ఉండగా, మొత్తంగా 6502 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో పబ్లిక్ కుళాయిలను విడిచి పెట్టి వ్యక్తిగత కుళాయిల ద్వారా మున్సిపాలిటీ నెలకు ఒక్కో కనెక్షన్‌కు రూ.80లు, ఏడాదికి రూ.960లు వసూలు చేస్తోంది. అయినా అవసరమైన మేరకు తాగునీరు అందివ్వలేకపోతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.65 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ లోగా ప్రభుత్వం మారిపోవడంతో ఆ నిధులు అటకెక్కాయి.

పట్టించుకోని ఆందోళనలు

పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలకు పట్టణ ప్రముఖులు, మేధావులు, అభ్యుదయ వాదులు సంఘీభావం తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అక్టోబర్ 1న చలో కలెక్టరేట్ చేపట్టేందుకు పట్టణ మహిళలు, వామపక్షాలు నిర్ణయించాయి.

శాశ్వత పరిష్కారం చూపండి



పార్వతీపురం పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. వర్షం పడితే బురద నీరు కుళాయిల ద్వారా వస్తుంది. ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఫలితం లేదు. అందుకే రిలే నిరాహార దీక్షలు చేస్తున్నాం. దీనిపై అధికారులు స్పందించాలి.

– వాకాడ ఇందిర, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు

సాకులు చెబుతున్నారు



తాగునీటి సమస్య పరిష్కరించకుండా పాలకులు, అధికారులు సాకులు చెబుతున్నారు. వర్షాకాలం వస్తే బురద నీరు, వేసవి కాలంలో నీరే రాదు అటువంటి పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. గతంలో ఎన్నికల హామీలో భాగంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి. రిలే దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు.

– రెడ్డి శ్రీదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి

1న కలెక్టరేట్ ముట్టడి



తాగునీటి సమస్యకు పరిష్కారం చూపనట్లయితే అక్టోబర్ 1న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం సరైన విధానం కాదు. తాగునీటి సమస్యతో దశాబ్ద కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– కె.సుబ్బారావమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా

104 సంచార వైద్య సేవలు


రోగుల యోగక్షేమాలను తెలుసుకుంటున్న డాక్టర్ ఉష

సీతానగరం: మండలంలోని గుమ్మిడివరం, అప్పయ్యపేట గ్రామాల్లో 104 సంచార వైద్య సేవల ద్వారా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఉష ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాల్లో సిబ్బంది సంధ్య, సింహాచలం, పార్వతి, 104 సిబ్బంది ప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం


సరాయివలసలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మక్కువ: మండలంలోని సరాయివలస గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ తెర్లి మోహిణి అధ్యక్షతన పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పి.రాజశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. పాలు, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మక్కువ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్య శిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సాలూరు: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ కో ఆర్డినేటర్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి వచ్చే నెల 2 వరకు ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈయన గతంలో బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థలో ఏఓగా విధులు నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలబాలికల అండర్ 14, 17 హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పోటీలను ముందుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. అదే సమయంలో ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతామన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వస్తుందన్నారు విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలన్నారు. పీడీలు వాసుదేవరావు, ఎస్.మాధవ రావు, బి.వైకుంఠరావు, మురళి మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తెనాలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పాఠశాలల్లో పర్యాటక దినోత్సవం


మాట్లాడుతున్న ఎంఈఓ-1 సూరిదేముడు

సీతానగరం: మండలంలోని పలు పాఠశాలల్లో అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ 1 జి.సూరిదేముడు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఉపాధ్యాయులు వివరించారు. ఎంఈఓ విజన్ లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కేజీబీవీ, ఎస్‌ఓఈ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘అల్లం’త దూరాన ధర

- నెల రోజులుగా పెరుగుతున్న ధర
- ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అల్లం రూ.300పైనే...


అల్లం

పార్వతీపురం: కూర ఏది వండాలన్నా.. అల్లం తప్పనిసరి. అలాంటి అల్లం కొనుగోలు చేయాలంటే పేద, మధ్యతరగతి వారు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత నెల రోజుల నుండి అల్లం ధర ఆకాశాన్ని అంటుతుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో అల్లం రూ.300 నుండి రూ.320వరకు ధర పలుకుతుంది. దీంతో అల్లం కొనుగోలు చేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. అల్లం ధర రోజురోజుకు పెరుగుతూనే వస్తుంది. జిల్లాలో అల్లం సాగు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే అల్లంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసుకొని చిరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా అల్లం పంట చేతికి రాకపోవడంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అవసరాలకు తగ్గ అల్లం దిగుమతి అయ్యేంత వరకు ఈ పరిస్థితి తప్పదని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. హోటళ్లలో వీటి వినియోగం ఎక్కువగా ఉండడంతో వీటి ధరలను చూసి సామాన్యులతో పాటు హోటల్ యజమానులు ఆందోళన చెందుతున్నారు. అల్లం ధర అమాంతం పెరగడంతో టిఫిన్లు విక్రయించే హోటళ్లలో అల్లం పచ్చడికి ఫుల్‌స్టాప్ పెట్టారు.

గోతులు పూడ్చిన యువత


గుంతలు పూడ్చుతున్న యువత

పార్వతీపురం టౌన్: పార్వతీపురం – రాయగడ ప్రధాన రహదారి ఇటీవల వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీన్ని మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి విన్నవించినా ప్రయోజనం ఉండడం లేదు. అధికారులు కూడా స్పందించడం లేదు. దీంతో ప్రమాదకరంగా ఉన్న ఈ రహదారిపై గోతులు పూడ్చేందుకు దుగ్గరాజుపేట, కంచరవీధి యువత ముందుకు వచ్చారు.

వారంతా శుక్రవారం రహదారి పనులను చేపట్టారు. ప్రమాదకరంగా మారిన రహదారిని పూర్తి స్థాయిలో బాగు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: విద్యార్థినిలు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ పి.రమేష్ నాయుడు సూచించారు. మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు పలు అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిల కిడ్నాప్, లైంగిక వేధింపులు నిత్యకృత్యంగా చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిలు జాగ్రత్తగా ఉండడంతోనే వీటి నుంచి బయటపడవచ్చన్నారు. విద్యార్థినిలపై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. అవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేస్తే పోక్సో కేసులు నమోదు చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఖడ్గవలస జంక్షన్‌లో కూడా సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరిచారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


వనజ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూఓ

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఏటీడబ్ల్యూఓ కె.చంద్రబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలంటే ప్రణాళిక ప్రకారం చదివించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. లెసన్ ప్లాన్, టీచర్ డైరీలను పరిశీలించారు. అందరూ సమన్వయంతో పని చేసి పాఠశాలకు గుర్తింపు తేవాలన్నారు. పాఠశాల సముదాయంలోని తుమ్మిగూడ, సీమలవానివలస ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

బుడ్డిపేటలో పొలంబడి


పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని బుడ్డిపేటలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక పద్ధతులను గుర్తించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ ఎస్.అవినాష్ అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి, విత్తే సమయం, మొనలు తుంచడం, నారుమడి యాజమాన్యం, కలుపుతీత వంటి కార్యక్రమాలపై వివరించారు. వీటి ద్వారా ఫలితాలు కొంత కాలం వరకు మాత్రమే పంటకు దోహదపడతాయన్నారు. దీర్ఘకాలిక పద్ధతుల్లో భాగంగా విత్తన రకాల ఎంపిక, సస్యభ్రమణం, పచ్చిరొట్ట మొక్కలు పెంచి కలియదున్నడం, ఎరువుల యాజమాన్యం వంటివి ఉపయోగపడతాయన్నారు. రైతులు సాగులో స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటలపై అవగాహన కలిగి మెలకువలు పాటించాలన్నారు. వ్యవసాయ సహాయకులు పి.లక్ష్మణ్, బి.సుధీర్, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

‘లయన్స్’ మెగా మెడికల్ క్యాంపు


డీకే పట్నంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం

పార్వతీపురం టౌన్: మండలంలోని డీకే పట్నం గ్రామ సచివాలయ ఆవరణలో పార్వతీపురం లయన్స్ క్లబ్ నేతృత్వంలో మెగా మెడికల్ క్యాంపు శుక్రవారం నిర్వహించారు. పార్వతీపురం వైద్యులు, శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 650 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గుండె జబ్బులు, జనరల్ మెడిసిన్, చర్మ వ్యాధులు తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు శిబిరంలో పాల్గొని సేవలు అందించారని పార్వతీపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌బీ రావు తెలిపారు. గుండె జబ్బులకు సంబంధించి 2డి ఎకో స్కాన్, ఈసీజీ, షుగర్, మలేరియా వంటి పలు పరీక్షలు ఉచితంగా చేసినట్టు చెప్పారు. శిబిరంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ పసుమర్తి శివ ప్రసాద్, ట్రెజరర్ లయన్ బీవీఎస్ నాయుడు, లయన్స్, రెడ్‌క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ జేకేఎస్ సభ్యులు తదితరులు పాల్గొని తమ వంతు సేవలు అందించారు.

వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి


కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో అక్రమంగా తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ మెయిన్ గేటు దగ్గర తొలగించిన వీఓఏలన విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెదిరింపులు, మానసిక వేధింపులు ఆపాలని, 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీఓఏలకు 2024 మార్చి నెల నుండి బకాయి వున్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటివరకు వేతనాలకు సంబంధించి అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందించిన స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక ఇబ్బందులు నుండి వీఓఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఇప్పటికే వందల మందిని తొలగించారని, మరి కొందరిని తొలగించేందుకు జాబితాలు తయారు చేస్తున్నారని ఇది సరికాదన్నారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా వీఓఏల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధ రావు శ్రామిక మహిళ సంఘం నాయకులు బి.ఇందిర, కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బంకురు సూరిబాబు, వీఓఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కట్టిన భవనాన్ని గాలికి వదిలేసారు..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో పార్వతీపురం పట్టణంలో బెలగాం అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. దీని పనులు కూడా పూర్తయ్యాయి. ఇంతలోనే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైనా ఈ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేశారు. పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఈ భవనాన్ని పేదల ఆరోగ్యం నిమిత్తం అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రాజకీయాలను పక్కన పెట్టి ప్రజావసరాల నిమిత్తం వెంటనే దీన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

– పార్వతీపురం టౌన్

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా శత శాతం ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహం అందివ్వాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ రమాప్రభ అన్నారు. గుమ్మలక్ష్మీపురం వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులతో వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు తగ్గటం, భూసారం తగ్గిపోవడం వంటి పరిణామాలు సంభవించి రైతులంతా కుదేలయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పంట సాగుకు అయ్యే పెట్టుబడులు తగ్గటంతో పాటు, దిగుబడులు పెరుగుతాయని, భూసారం పెరుగుతుందని, సహజంగానే లభించే వస్తువులతో సేంద్రీయ ఎరువులు తయారు చేసుకొవచ్చని తెలియజేశారు. అనంతరం వివిధ కషాయాల తయారీలపై డెమో ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆదయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గణేష్ చంద్ర, అన్నపూర్ణ, నిర్మలా దేవి, భూషణ రావు, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.